## క్లుప్తంగా

### బైనేరు బ్రిడ్జిపై ట్రాఫిక్‌కు అంతరాయం



జంగారెడ్డిగూడెం బైనేరు బ్రిడ్జి వద్ద ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడిన దృశ్యం

**జంగారెడ్డిగూడెం:** జంగారెడ్డిగూడెంలో జాతీయ రహదారిపై ఉన్న బైనేరు బ్రిడ్జి వద్ద ఆదివారం ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. బ్రిడ్జి వద్ద భారీ గోతులు ఏర్పడటంతో వాహనాలు గోతుల్లో ఇరుక్కుని బయటకు రావడానికి అధిక సమయం పడుతోంది. దీంతో కిలోమీటరు మేర వాహనాలు నిలిచిపోయాయి. వాహనదారులు ట్రాఫిక్ జామ్ నుంచి బయటకు పడటానికి నానా ఇబ్బందులు పడ్డారు. కొయ్యలగూడెం నుంచి జంగారెడ్డిగూడెం పట్టణానికి రావడానికి, బయటకు వెళ్లడానికి బైనేరు వంతెన దాటాల్సి ఉంది. వాహనదారుల ఇబ్బందులు తొలగించేలా వెంటనే ఆర్అండ్‌బీ అధికారులు స్పందించి గోతులను పూడ్చాలని ప్రజలు కోరుతున్నారు.

### చిన్నారులకు ఆర్థిక సాయం



చల్లవారిగూడెంలో ఆర్థిక సహాయం అందజేస్తున్న గణేష్ యూత్ సభ్యులు

**జంగారెడ్డిగూడెం రూరల్:** చల్లవారిగూడెంలో గణేష్ యూత్ సభ్యులు చిన్నారులకు ఆర్థిక సహాయం అందించారు. గ్రామానికి చెందిన చింతలపూడి వెంకటేష్, ఉష దంపతులు మరణించారు. వారి సంతానం వర్షిణి (8), వరుణ్ (6) తాత కనిక్ల రాజు, అమ్మమ్మ మణెమ్మల వద్దే ఉంటున్నారు. ఆ కుటుంబం ఆర్థిక సమస్యలతో ఇబ్బంది పడుతుండడంతో గణేష్ యూత్ సభ్యులు స్పందించి ఆ ఇద్దరు చిన్నారుల పేరున బ్యాంక్ ఖాతాలో రూ: 20,000 నగదును జమ చేశారు. ఈ కార్యక్రమంలో యూత్ అధ్యక్షుడు పసుపులేటి కిషోర్, సభ్యులు సత్రం దొరబాబు, మైనం మధు, తూటికుంట వెంకట రమణ, అఖిల్, భాను, మిండ చిన్ని, సతీష్ పాల్గొన్నారు.

### నిస్వార్థంగా సమాజసేవ చేయాలి

**ఉంగుటూరు:** లయన్స్ క్లబ్ అధ్యక్షుడుగా పుసులూరి ప్రకాష్ నిస్వార్థ సేవలు అందజేసి మంచి పేరు తెచ్చుకోవాలని మాజీ ఎమ్మెల్యే గన్ని వీరాంజనేయులు అన్నారు. నారాయణపురం లయన్స్ ఆడిటోరియంలో లయన్స్ క్లబ్ ఆఫ్ చేబ్రోలు నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం చేశారు. నూతన అధ్యక్షుడిగా పుసులూరి ప్రకాష్, కార్యదర్శిగా పాతూరి వంశీ, కోశాధికారిగా వంకిన ధర్మరాజు, ఉపాధ్యక్షుడిగా ఆకల పాండురంగరాజు, కార్యవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. కమిటీ క్లబ్ కౌన్సిల్ కార్యదర్శి ఫంకజాక్షన్, ప్రమాణ స్వీకారం చేయించారు.

### నేత్రదానం స్ఫూర్తిదాయకం

**దెందులూరు:** ఆర్టీసీ రిటైర్డ్ డ్రైవర్ కొలుసు నాగ వెంకట సత్యనారాయణ (బాబూరావు) నేత్రదానం స్ఫూర్తిదాయకమని ఆర్టీసీ గన్నవరం సీటీఓ కొలుసు శ్రీరాములు అన్నారు. ఆదివారం ఆయన దెందులూరు యాదవుల వీధిలోని బాబూరావు కుటుంబ సభ్యులను కలిసి ప్రగాఢ సంతాపం తెలిపారు. మరణానంతరం మరొకరికి చూపు ప్రదానం చేయాలన్న మహోన్నత భావంతో బాబూరావు నేత్రాలను దానం చేయడం ఆర్టీసీ శాఖకు గర్వకారణంగా ఉందన్నారు. తొలుత ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఏలూరు డిపో ఎంప్లాయీస్ యూనియన్, మజ్దూర్ యూనియన్ డ్రైవర్లు, కండక్టర్లు, వైఎస్సార్‌సీపీ నేత దెందులూరు కో ఆపరేటివ్ సొసైటీ మాజీ చైర్మన్ కొలుసు గణపతిరావు పరామర్శించారు.

### పెట్రోలు బంకుల్లో తనిఖీలేవీ?

**దెందులూరు:** పెట్రోలు బంకుల్లో సంబంధిత శాఖాధికారులు పర్యవేక్షణ చేయాలని వినియోగదారులు కోరుతున్నారు. కేంద్ర ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా బంకుల్లో వినియోగదారులకు ఎటువంటి సౌకర్యాలు ఏర్పాటు చేయడం లేదు. అధికారుల పర్యవేక్షణ కొరవడిందని వినియోగదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బంకులో గాలి పెట్టమని బంకు సిబ్బందిని అడిగితే మరమ్మతుకు గురైందని, ఆపరేటర్ బయటకు వెళ్లాడని సమాధానం చెబుతున్నారని పలువురు ఆరోపించారు. ఆశ్రం ఆసుపత్రి నుంచి ఏలూరు వెళ్లే దారిలో ఉన్న పెట్రోలు బంకుల్లో ద్విచక్ర వాహనాలకు గాలిపట్టడం లేదని వినియోగదారులు ఆరోపిస్తున్నారు. బంకు యజమానులు వినియోగదారులకు నాణ్యమైన సేవలు అందేలా కృషి చేయాలని పలువురు కోరుతున్నారు.

### ఇంటిగ్రేటెడ్ హాస్టల్‌లో ఖాళీలు

**దెందులూరు:** కొవ్వలిలోని నియోజకవర్గ ఇంటిగ్రేటెడ్ హాస్టల్‌లో ఖాళీలున్నాయని అర్హులు దరఖాస్తు చేసుకోవాలని ఏఓ సత్యనారాయణ తెలిపారు. 5 నుంచి 10వ తరగతి వరకు దాదాపు 250 సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. పూర్తి సౌకర్యాలతో అన్ని వసతులు కలిగి ఉన్న నియోజకవర్గ ఇంటిగ్రేటెడ్ హాస్టల్‌ను పాఠశాలకు వెళ్లే విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వివరాలకు కొవ్వలిలోని ఇంటిగ్రేటెడ్ హాస్టల్‌లో సంప్రదించాలని ఆయన సూచించారు.

# శునకాలతో జాగ్రత్త..!

- వీధి కుక్కల్లో విస్తరిస్తున్న డెర్మటైటిస్ వ్యాధి
- ఈ తరహా కుక్కలు కరిస్తే రేబిస్ సోకే ప్రమాదం
- జాగ్రత్తలు పాటించాలంటున్న వైద్యులు

**ద్వారకాతిరుమల:** ద్వారకాతిరుమలలో వీధి కుక్కల బెడద ఎక్కువయ్యింది. రోడ్లపై గుంపులు గుంపులుగా స్వైర విహారం చేస్తూ ప్రజలను హడలెత్తిస్తున్నాయి. ద్విచక్ర వాహనాలకు అడ్డుపడుతూ రోడ్డు ప్రమాదాలకు కారణం అవుతున్నాయి. ఇళ్ల వద్దకు చేరి ప్రజలను బెంబేలెత్తిస్తున్నాయి. వాటిలో కొన్ని శునకాలు చర్మవ్యాధితో బాధపడుతున్నాయి. అలాంటి శునకాలతో ప్రజలు జాగ్రత్తగా ఉండాలని, కుక్క కాటుకు గురైతే ప్రాణాంతక రేబిస్ వ్యాధి సోకే ప్రమాదం ఉందని వైద్యులు చెబుతున్నారు.

**డెర్మటైటిస్ సంక్రమించే వ్యాధి**

డెర్మటైటిస్ అనేది అంటువ్యాధి. ఇది సోకిన కుక్కలకు చర్మంపై వెంట్రుకలు పూర్తిగా ఊడిపోతాయి. రక్తం, చీముతో కూడిన పొక్కులు ఏర్పడతాయి. చర్మం మందంగా మారుతుంది. డెర్మటైటిస్ సోకిన కుక్కలు మనుషులకు, పశువులకు తగిలినా చర్మ సంబంధిత వ్యాధి సంక్రమిస్తుంది. మనుషుల్లో కూడా చర్మంపై ఉండే వెంట్రుకలు రాలిపోతాయి. మచ్చలు ఏర్పడి చర్మం మందంగా మారుతుంది. పశువులకు సోకితే వాటి బాహ్య చర్మంపై మచ్చలు ఏర్పడతాయి. వ్యాధి సోకిన కుక్క కరిస్తే రేబిస్ వచ్చే ప్రమాదం ఉంది. ఈ వ్యాధి బారిన పడిన జంతువుల్లో చొంగ కార్చడం, డొక్కలు లోపలకు నొక్కుకుపోవడం, మేత సరిగ్గా తీసుకోకపోవడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. సకాలంలో వైద్యం అందించకపోతే ఆ పశువు, లేదా జంతువు మరణిస్తుంది. మనుషుల్లో కూడా దాదాపుగా ఇవే లక్షణాలు కనిపిస్తాయి. రేబిస్ సోకిన పశువులు, కుక్కల చొంగ చేతికి తగిలితే చర్మ గ్రంథుల ద్వారా వ్యాధి బారిన పడే అవకాశం ఉంది.

**జాగ్రత్తలు పాటించాలి**

పెంపుడు జీవాల ద్వారా వచ్చే వ్యాధుల పట్ల పెంపకందారులు పూర్తి అవగాహన కలిగి ఉండాలి. వ్యాధుల నివారణకు కుక్కలకు, పశువులకు, ఇతర జీవాలకు ఎప్పటికప్పుడు వ్యాక్సిన్లు వేయించాలి. ఇటీవల జునోసిస్ డేని పురస్కరించుకుని పశుసంవర్ధక శాఖ అధికారులు జంతు వ్యాధులపై అవగాహన కల్పించడంతోపాటు పెంపుడు కుక్కలు, జంతువులకు టీకాలు వేశారు. టీకాలు వేయిస్తే వాటిలో వ్యాధి నిరోధక శక్తి పెరిగి వ్యాధుల బారిన పడకుండా ఉంటాయి. వ్యాక్సినేషన్ చేయని వీధి కుక్కలు కరవడం వల్ల రేబిస్ సోకే ప్రమాదం అధికంగా ఉంటుంది. ప్రస్తుత వర్షాకాలంలో శునకాలు సంతానోత్పత్తికి యత్నించే క్రమంలో వాటిలో వ్యాధులు విస్తరించే అవకాశం ఉంది. కుక్క కాటుతో అలాగే ఇతర జంతువుల వల్ల మనుషులకు సంక్రమించే వ్యాధుల పట్ల ప్రజలు పూర్తి అవగాహన పెంచుకోవడం ద్వారా వ్యాధుల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవచ్చు.





ద్వారకాతిరుమలలో గుంపులుగా రహదారిపై స్వైరవిహారం చేస్తున్న వీధి శునకాలు, డెర్మటైటిస్ సోకిన శునకం

**కుక్కలతో జాగ్రత్తగా ఉండాలి**



ప్రస్తుత సీజన్‌లో కుక్కలతో జాగ్రత్తగా ఉండాలి. ముఖ్యంగా కేనాస్ మెంజు (డెర్మటైటిస్) వ్యాధి బారిన పడిన శునకాలతో ప్రమాదం. వీధి కుక్కల్లో పరన్న జీవుల కారణంగా వస్తుంది. బహిరంగ ప్రదేశాల్లో కనిపించే ఈ తరహా కుక్కలకు దూరంగా ఉండాలి. ఇవి తిండి తినలేక, చొంగ కార్చుతుంటాయి. వీటికి రేబిస్ ఉండే అవకాశం ఎక్కువగా ఉంది. క్షేత్ర స్థాయిలో వీటిపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. ముఖ్యంగా పిల్లలు వీటి బారిన పడకుండా తగు జాగ్రత్తలు పాటించాలి. ఇటువంటి కుక్క కాటుకు గురైతే తక్షణమే వైద్య సేవలు పొందాలి. ఈ వ్యాధిబారిన పడిన జీవాలకు 10 ఎంజీ ఐవర్‌మెక్టిన్ ట్యాబ్లెట్‌లను వాడితే ప్రయోజనం ఉంటుంది.

– అంగర సురేష్, మండల పశువైద్యాధికారి, ద్వారకాతిరుమల

## కళాకారుల పారితోషికపు బకాయిలు చెల్లించాలి

**టి.నరసాపురం:** కళాకారులకు ప్రభుత్వం నుంచి రావాల్సిన బకాయిలు వెంటనే చెల్లించాలని ఏపీ ప్రజానాట్యమండలి ఏలూరు జిల్లా సబ్ కమిటీ కన్వీనర్ టీవీఎస్ రాజు కోరారు. ఈమేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. 2014 నుంచి 2019 వరకు అప్పటి టీడీపీ ప్రభుత్వంలో జన్మభూమి, గ్రామదర్శిని, నగరదర్శిని తదితర కార్యక్రమాల ద్వారా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు అవగాహన కల్పించడం కోసం ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో కళాకారులంతా కళా ప్రదర్శన నిర్వహించారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం నుంచి కళాకారులకు రావాల్సిన ఆర్థిక పారితోషికం ఇవ్వలేదు. అప్పటినుంచి నేటి వరకు ఆ సొమ్ములు అందక, ఆయా కార్యక్రమాల నిర్వహణ కోసం చేసిన అప్పులు తీర్చలేక కళాకారులు సతమతమవుతున్నారు. ప్రస్తుతం మళ్లీ అధికారంలోకి వచ్చిన టీడీపీ ప్రభుత్వం వెంటనే బకాయిలు చెల్లించాలని కోరారు. అలాగే కళాకారులకు కళారూపాల ప్రదర్శనలకు అవకాశం ఇచ్చి ఉపాధి కల్పించడం, ప్రతి పేద కళాకారుడికి నెలకు రూ.10వేలు పెన్షన్ అందించేలా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

## బాలిక అదృశ్యంపై కేసు నమోదు

**జంగారెడ్డిగూడెం:** బాలిక అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై జ్యోతిబాస్ తెలిపారు. జంగారెడ్డిగూడెం పట్టణానికి చెందిన బాలిక స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియెట్ చదువుతోంది. ఈ నెల 13వ తేదీ మధ్యాహ్నం కిరాణా షాపునకు వెళుతున్నట్లు తల్లికి చెప్పి బాలిక బయటకు వెళ్లింది. అయితే ఎంత సేపటికి రాకపోవడంతో బాలిక తండ్రి చుట్టుపక్కల, తెలిసిన వారి ఇళ్ల వద్ద వెదికారు. అయినప్పటికీ ఆచూకీ లభించకపోవడంతో బాలిక తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

## ఆటోడ్రైవర్ల సమస్యలపై సమరశీల పోరాటాలు

**ఏలూరు (టూటౌన్):** ఆటో డ్రైవర్ల సమస్యలపై సీఐటీయూ ఆధ్వర్యంలో సమరశీల పోరాటాలు నిర్వహిస్తున్నట్లు ఏలూరు జిల్లా ఆటో అండ్ ట్రాలీ డ్రైవర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బి.సూరిబాబు, జె.గోపి తెలియజేశారు. ఏలూరు నగరం, చొదిమెళ్ల ఆటో స్టాండ్‌లకు చెందిన 20 మంది ఆటో డ్రైవర్లు సీఐటీయూలో చేరిన సందర్భంగా స్థానిక సీఐటీయూ జిల్లా కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. ఈ సందర్భంగా నూతనంగా యూనియన్‌లో చేరిన ఆటో డ్రైవర్లకు నాయకులు అభినందనలు తెలియజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ డ్రైవర్లు అందరూ ఆటోరిక్షాలు, డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. ప్రయాణికులతో స్నేహపూర్వకంగా మెలగాలని విజ్ఞప్తి చేశారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ప్రతి ఒక్కరూ యూనిఫామ్ ధరించాలని కోరారు. ఏలూరు నగరంలో సీసీ కెమేరాల ద్వారా విధించిన ఈ–చలానాలను రద్దు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆటో డ్రైవర్లకు సంక్షేమ బోర్డును రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేయాలని ఈ సందర్భంగా వారు కోరారు. ఈ సమావేశంలో వై.బాలాజీ, జి.డేవిడ్ రాజు, వి.దుర్గారావు, ఎల్.వెంకటేశ్వరరావు, సీహెచ్ ప్రసాదరావు, ఎస్.చినబాబు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ కాలనీ రోడ్డుకు మరమ్మతులు



కాలనీ రోడ్డు గుంతలు పూడ్చిన దృశ్యం

**టి.నరసాపురం:** టి.నరసాపురం ఇందిరమ్మ కాలనీ రోడ్డుకు మరమ్మతులు చేయించారు. ఈ రోడ్డు గోతులమయంగా ఉండడంతో వర్షం నీరు నిలిచిపోయి స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సమస్య పరిష్కరించాలని స్థానికులు పంచాయతీ అధికారులకు విన్నవించుకున్నారు. ఈ నేపథ్యంలో పంచాయతీ అధికారులు రోడ్డులోని గోతులను పూడ్చి రహదారి ప్రయాణానికి అనువుగా మార్చారు. దీనిపై కాలనీవాసులు హర్షం వ్యక్తం చేశారు.

## 17 నుంచి ఆషాడ మాసోత్సవాలు

**జంగారెడ్డిగూడెం:** పట్టణంలోని వియదుర్గమ్మ అమ్మవారి ఆలయంలో అషాడ మాసోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 17వ తేదీ తొలి ఏకాదశి సందర్భంగా విజయదుర్గ అమ్మవారికి శాకాంబరి అలంకరణతో ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 19వ తేదీన చండీహోమం, 20న బోనాల సమర్పణ, అమ్మవారికి పల్లకీసేవ తదితర పూజలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. చండీహోమం నందు ఉభయదారులుగా పాల్గొనుటకు నలుగురు దంపతులకు మాత్రమే అవకాశం ఉందని, ఆసక్తి గల భక్తులు ముందుగా ఆలయ కమిటీని సంప్రదించాలన్నారు.

# ఎడతెరిపి లేని వర్షాలు.. స్తంభించిన జనజీవనం

**చింతలపూడి:** మెట్ట ప్రాంతంలో అల్పపీడన ప్రభావంతో గత వారం రోజులుగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. ముఖ్యంగా శుక్రవారం రాత్రి నుంచి కురుస్తున్న ఎడతెరిపిలేని వానతో జన జీవనం స్తంభించింది. రోడ్లు జలమయమయ్యాయి. మండలంలోని చెరువులు జలకళతో ఉట్టిపడుతున్నాయి. చెరువుల్లోకి నీరు చేరుతుండటంతో ఈ ప్రాంత రైతుల మోముల్లో ఆనందం వ్యక్తమవుతోంది. పలుచోట్ల వర్షపునీరు రోడ్లపై నుంచి ప్రవహిస్తుంది. భారీ వర్షాలకు పంట పొలాలు సైతం చెరువులను తలపిస్తున్నాయి.

**మెట్టలో సార్వా పనులు ప్రారంభం**

చింతలపూడి నియోజకవర్గంలో సార్వా దుక్కులు దున్నుకుని నాట్లు వేసే కార్యక్రమం ముమ్మరంగా సాగుతోంది. సబ్‌డివిజన్ పరిధిలో 15,793 హెక్టార్లలో వరి సాగు లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇందులో చింతలపూడి మండలంలో అత్యధికంగా 7,603 హెక్టార్లు, లింగపాలెం మండలంలో 3,072 హెక్టార్లు, టి నరసాపురం మండలంలో 2,661 హెక్టార్లు, కామవరపుకోట మండలంలో 2,457 హెక్టార్లలో రైతులు వరి పంటను సాగు చేస్తారు. ఇవి కాక 307 ఎకరాల్లో మొక్కజొన్న, 585 ఎకరాల్లో వేరుశనగ, 1,125 ఎకరాల్లో పొగాకు పంటలు పండిస్తారు.

**నేలకొరిగిన భారీ వృక్షం**

**టి.నరసాపురం:** టి.నరసాపురం – కామవరపుకోట రహదారిలో పెద్ద వృక్షం నేలకొరిగింది. ఆదివారం ఉదయం వీచిన భారీ ఈదురుగాలులకు వృక్షం నేలకొరిగింది. రోడ్డుకు అడ్డంగా పడటంతో వాహన రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. దీంతో పంచాయతీ అధికారులు స్పందించి రోడ్డుపై పడిన వృక్షాన్ని పక్కకు తొలగించి రాకపోకలను పునరుద్ధరించారు.



చింతలపూడి సమీపంలో భారీ వర్షాలకు చెరువులను తలపిస్తున్న పొలాలు



చింతలపూడి: రోడ్లపైకి చేరిన వర్షపు నీరు



చింతలపూడి: వ్యవసాయ పనుల్లో నిమగ్నమైన దృశ్యం



టి.నరసాపురం: కామవరపుకోట వెళ్లే రహదారిలో నేలకొరిగిన భారీ వృక్షం

## బండిరేవు వద్ద ఎర్రకాలువపై వంతెన నిర్మించండి

**టి.నరసాపురం:** టి.నరసాపురం – కొమ్ముగూడెం రహదారిని మరమ్మతు చేయించి బండి రేవు వద్ద ఎర్రకాలువపై వంతెన నిర్మించాలని పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజును పలువురు రైతులు, గ్రామస్తులు కోరారు. ఈ మేరకు ఆదివారం ఎమ్మెల్యే బాలరాజుకు వినతిపత్రం అందజేశారు. వంతెన లేకపోవడం వల్ల నందమూరి విద్యాసాగర్ ప్రాజెక్టు కలంగి పడినప్పుడల్లా వరద విపరీతంగా రావడంతో అటు, ఇటు రాకపోకలు నిలిచిపోతున్నాయన్నారు. పొలం పనులపై ప్రతిరోజు రైతులతో పాటు వందల మంది రైతుకూలీలు కూడా ఇటు వైపే వెళ్లాల్సి ఉంటుందని, వంతెన లేకపోవడం చాలా ఇబ్బందికరంగా ఉందన్నారు. గతంలో ఈ వరద ఎక్కువ రావడం వల్ల కొన్ని పశువులు (మూగ జీవాలు) చనిపోయిన సందర్భాలు ఉన్నాయని ఎమ్మెల్యేకు వివరించారు. స్పందించిన ఎమ్మెల్యే చిర్రి బాలరాజు నాలుగు నెలల్లో వంతెన పనులు ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు.



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న రైతులు

## గురుకుల బాలికల పాఠశాలకు శాశ్వత భవనాలు నిర్మించాలి

**దెందులూరు:** మహాత్మ జ్యోతిరావు పూలే బాలికల గురుకుల పాఠశాలకు శాశ్వత భవనాలు నిర్మించాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు కాకినాని కోరారు. ఆదివారం దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్‌ను ఎమ్మెల్యే కార్యాలయంలో కలిసి ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. పెదవేగి మండలం వంగూరులో అద్దె భవనంలో కొనసాగుతున్న గురుకుల పాఠశాలకు స్థలం కేటాయించాలని, శాశ్వత భవనాలు నిర్మించాలన్నారు. దెందులూరు మండలం వేగవరంలో హేలాపురి ఇంజనీరింగ్ కళాశాలకు సంబంధించిన భవనాల్లో 2017 నుంచి అద్దె ప్రాతిపదికన జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాల నిర్వహిస్తున్నట్టు తెలిపారు. అరకొర వసతులతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని అన్నారు. ఇటీవల గురుకుల పాఠశాలను ఖాళీ చేయమని హేలాపురి యాజమాన్యం కోరారన్నారు. దీంతో వంగూరులో పాత ప్రైవేటు కళాశాలకు సంబంధించిన భవనంలోకి గురుకుల పాఠశాల మార్చారని పేర్కొన్నారు. అక్కడ పాముల బెడద ఉందని వివరించారు. 240 మంది విద్యార్థులున్న పాఠశాలలో ఒక ప్రిన్సిపల్ మినహా టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది అంతా పార్ట్‌టైం, కాంట్రాక్ట్ సిబ్బంది కావడంతో విద్యార్థులు ఇబ్బందులకు

# ఘనంగా బోనాల జాతర ఊరేగింపు

**బుట్టాయగూడెం:** బుట్టాయగూడెం మండలం రెడ్డిగణపవరంలో ఆదివారం బోనాల జాతర పండగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బండర్లగూడెంలోని తాటి కౌసల్య ఇంటి వద్ద నుంచి బోనాలను భక్తులు అమ్మవారికి ఇష్టమైన నైవేద్యాన్ని తలపై ఎత్తుకొని పోతురాజు విన్యాసాలు, శివ సత్తుల పూనకాలతో గ్రామంలోని అన్ని వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం కనకదుర్గమ్మతల్లిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసి అమ్మవారికి బోనాలు సమర్పించారు. కనకదుర్గమ్మ ఆలయ ధర్మకర్త భౌమరాజు ధనుంజయరాజు మాట్లాడుతూ గ్రామం సుభిక్షంగా ఉండాలని, భక్తురాలు తాటి కౌశల్య ఆధ్వర్యంలో ఆషాడ బోనాల జాతర ఊరేగింపు నిర్వహించినట్లు చెప్పారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అయిన బోనాల జాతరను గత మూడేళ్ల నుంచి రెడ్డిగణపవరంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఆషాడ మాసంలో మూడో ఆదివారం ఈ బోనాల జాతర ఊరేగింపును నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో పలువురు భక్తులు పాల్గొన్నారు.



రెడ్డిగణపవరంలో బోనాల జాతరలో పోతురాజు విన్యాసాలు, శివ సత్తులు పూనకాలతో భక్తులు



రెడ్డిగణపవరంలో బోనాల జాతరలో పాల్గొన్న భక్తులు



బోనాలు తలపై ఎత్తుకొని ఊరేగింపు నిర్వహిస్తున్న దృశ్యం

# నేడు జగన్నాథ రథయాత్ర

**భారీగా ఏర్పాట్లు చేస్తున్న ఇస్కాన్ ప్రతినిధులు**

**ఏలూరు (ఆర్ఆర్‌పేట):** అంతర్జాతీయ కృష్ణ చైతన్య సంఘం (ఇస్కాన్) ఆధ్వర్యంలో నగరంలో రెండోసారి జగన్నాథ రథయాత్ర నిర్వహించనున్నారు. సోమవారం నిర్వహించనున్న ఈ రథయాత్ర నిమిత్తం ఇస్కాన్ ప్రతినిధులు భారీగా ఏర్పాట్లు చేస్తున్నారు. స్థానిక శనివారపు పేటలోని ఇస్కాన్ మందిరం వద్ద నుంచి రథయాత్ర ప్రారంభానికి సన్నాహకాలు చేస్తున్నారు. ఇప్పటికే రథం నగరానికి రాగా దానిని అత్యంత సుందరంగా ముస్తాబు చేస్తున్నారు. ఆదివారం మందిరం వద్దకు చేరుకున్న రథాన్ని, రథంలో నగర యాత్ర చేయనున్న జగన్నాథుడు, జగన్నాథుని సోదరుడు బలదేవ్, సోదరి సుభద్ర ఉత్సవ విగ్రహాలను నగరానికి చెందిన పలువురు భక్తులు సందర్శిస్తున్నారు.

**రథయాత్ర సాగేదిలా..**

జగన్నాథ రథయాత్ర నగరంలోని అన్ని ముఖ్య ప్రాంతాలనూ కలుపుతూ ముందుకు సాగుతుందని ఏలూరు ఇస్కాన్ మందిర అధ్యక్షుడు రాధావల్లభ దాస్ తెలిపారు. స్థానిక లునాని పార్కు వద్ద ఉన్న ఇస్కాన్ మందిరం నుంచి మధ్యాహ్నం 2 గంటల నుంచి ప్రారంభమయ్యే ఈ రథయాత్ర స్థానిక ఫైర్ స్టేషన్ సెంటర్, రామచంద్రరావు పేట మెయిన్ రోడ్డు, ఒన్‌టౌన్, మెయిన్ బజారు మీదుగా సాగి రామకోటి ప్రాంగణానికి చేరుకుంటుంది. ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి ఈ యాత్రను ప్రారంభించిన అనంతరం వందలాది మంది భక్తులు నృత్యాలు, కీర్తనలతో, గానాలతో, కోలాట ప్రదర్శనలతో నగర వీధుల్లో ఆనందోత్సాహాల మధ్య జరుగుతుంది. ఇందుకు గాను ఇప్పటికే వివిధ ప్రాంతాలకు చెందిన సుమారు 400 మంది ఇస్కాన్ ప్రతినిధులు నగరానికి చేరుకున్నారు. వీరితో పాటు నగరానికి చెందిన జగన్నాథుని భక్తులు ఈ రథయాత్ర వెంట నడువనున్నారు.

**రామకోటిలో ప్రత్యేక కార్యక్రమాలు..**

నగరంలోని ప్రధాన ప్రాంతాల గుండా సాగిన రథయాత్ర రామకోటి ప్రాంగణానికి చేరుకున్న అనంతరం అక్కడ ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించేందుకు ఇస్కాన్ ప్రతినిధులు ఏర్పాటు చేశారు. దీనిలో భాగంగా సాయంత్రం 6.30 గంటల నుంచి రామకోటి ప్రాంగణంలో స్వామివారికి పుష్పాభిషేకం, చప్పన్ భోగ నైవేద్యం సమర్పించనున్నారు. అనంతరం జగన్నాథ ప్రవచనం, భక్తులందరికీ జగన్నాథ ప్రసాద విందు ఏర్పాటు చేశారు.



రథయాత్ర కోసం ముస్తాబు చేసిన జగన్నాథుని రథం



రథంలో ఊరేగనున్న జగన్నాథ, బలదేవ, సుభద్ర విగ్రహాలు